సాక్షి చిత్తూరు

శనివారం । 14 । జనవరి । 2023



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,080
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.72

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	31	15
తిరుపతి	32	16
తిరుమల	27	12
గూడూరు	32	16
నగరి	32	17



16 నుంచి హోమ మహోత్సవాలు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో 16 నుంచి 21వ తేదీ వరకు ప్రత్యేక హోమ మహోత్సవాలు నిర్వహించనున్నారు. 16న గణపతి పూజతో హోమ మహోత్సవాలు ప్రారంభంకానున్నాయి.

న్యూస్‌రీల్

నేడు మకరజ్యోతి దర్శనం



సదుం: అయ్యప్పస్వామి ఆలయం

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోట మల్లై అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం మకరజ్యోతి దివ్యదర్శనం ఇవ్వనుంది. ముందుగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తిరు ఆభరణాలకు సదుమ మ్మ ఆలయంలో పూజలు చేసి కుటుంబ సభ్యులతో కలిసి ఊరేగింపుగా అయ్యప్ప స్వామి ఆలయానికి చేరుకుంటారు. ఆలయం వద్ద భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేశారు.

19న హుండీ కానుకల లెక్కింపు

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిహుండీ కానుకల లెక్కింపును 19న నిర్వహించనున్నట్లు చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఆలయ సిబ్బంది హాజరు కావాలని ఆదేశించారు.

నేడు ఉపకరణాల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్: మానసిక వైకల్యం కల పిల్లలకు శనివారం చిత్తూరులోని బాలాజీనగర్‌లో ఉన్న మున్సిపల్ పాఠశాలలో ఉపకరణాలు పంపిణీ చేస్తున్నట్టు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో సమగ్రశిక్ష శాఖ ద్వారా జిల్లాలోని 262 మంది మానసిక వైకల్యం కల పిల్లలకు ఉపకరణాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఒక్కొక్క బోధనా ఉపకరణం విలువ రూ.10 వేలు ఉంటుందని, 262 ఉపకరణాలకు రూ.26.20 లక్షలను ప్రభుత్వం ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు.

ఆ భూమి ప్రభుత్వానిదే

చిత్తూరు కలెక్టరేట్ : ఏడేళ్లుగా కొనసాగుతున్న భూ సమస్యను కలెక్టరేట్ అధికారులు పరిష్కరించారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపంజాణి మండలం వీరప్పల్లి పంచాయతీలో సర్వే నంబర్లు 31/1, 34/2లతో పాటు మరికొన్ని సర్వే నంబర్లను అక్రమంగా వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేశారని పేర్కొన్నారు. వెబ్‌ల్యాండ్‌లో పలు సర్వేల పేరుతో నమోదు చేసిన 161.98 ఎకరాల భూమి ప్రభుత్వానికి చెందినదేనని, దాన్ని సుందరాచారి, ఆయన సతీమణి ఉమారాణి పేరుతో అక్రమంగా నమోదు చేశారని జాయింట్ కలెక్టర్ ధ్రువీకరించారు. ఆ భూమిని రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భూమిని స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఉత్తర్వులు పంపినట్లు జేసీ తెలిపారు.

స్విమ్స్‌లో రోజూ అంకాలజీ ఓపీ వైద్య సేవలు

తిరుపతి తుడా : స్విమ్స్ ఆస్పత్రిలో రోజూ అంకాలజీ ఓపీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్టు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు స్విమ్స్ పరిధిలోని శ్రీపద్మావతి వైద్య కళాశాలలో సర్జికల్ అంకాలజీ, రేడియేషన్ అంకాలజీ, మెడికల్ అంకాలజీ విభాగాల్లో ఓపీ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ఓపీలు పొంది వైద్య సేవలు పొందవచ్చన్నారు.

15న ఉచిత అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు రద్దు

స్విమ్స్ రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో గర్భిణులకు ఉచితంగా నిర్వహించే అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలను సంక్రాంతి పండుగ సందర్భంగా 15వ తేదీన రద్దు చేసినట్టు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. 22 నుంచి ప్రతి ఆదివారం ఈ ఉచిత స్కానింగ్ పరీక్షలు యథావిధిగా అందుబాటులో ఉంటాయన్నారు.

మూడు రోజుల పండుగ సంప్రదాయాలు మెండుగా..

- ఉమ్మడి జిల్లాలో సంక్రాంతి శోభ
- నేటి నుంచి మూడు రోజులు సంక్రాంతి సంబరాలు
- పల్లెల్లో ఉట్టిపడుతున్న పండుగ సందడి
- రెండేళ్ల కరోనా తర్వాత ఘనంగా నిర్వహించేందుకు సమాయత్తం



గంగిరెద్దులు.. గొబ్బెమ్మ పాటలు.. రంగవల్లులు.. హరిదాసు కీర్తనలు, బుడబుక్కల చప్పుళ్లు.. అత్తారింట కొత్త అల్లుళ్లు.. కొంటె మరదళ్ల సందళ్లు.. పిండివంటల ఘుమఘుమలు.. అబ్బో! ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి శోభ ఉట్టిపడుతోంది. రెండేళ్ల కరోనా తర్వాత పండుగను అంగరంగ వైభవంగా జరుపుకునేందుకు ప్రజానీకం సిద్ధమైంది. ఇప్పటికే సంక్రాంతికి కావాల్సిన సరంజామా సమకూర్చుకుని పండుగ చేసుకునేందుకు సిద్ధమైంది. మూడు రోజుల పండుగ.. ముచ్చటైన పండుగ.. సంస్కృతి, సంప్రదాయాలపై 'సాక్షి' స్పెషల్ ఫోకస్..

సాక్షి ప్రతినిధి, తిరుపతి: పల్లె వాతావరణం ఉట్టిపడేలా.. సంస్కృతి సంప్రదాయాలు మరింత మెరుగు పడేలా.. సంక్రాంతిని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు స్థానికులు సిద్ధమయ్యారు. ముఖ్యంగా భోగి, కనుమ మధ్యలో వచ్చే సంక్రాంతిని అత్యంత వైభవంగా జరుపుకునేందుకు సన్నద్ధమయ్యారు. మొదటి రోజు అంటే శనివారం వేకువ జాము భోగిమంటలు వేసేందుకు కావాల్సిన ముళ్లకంప, టైర్లు, ఇతరత్రా వాటిని సిద్ధం చేసుకున్నారు. అలాగే ఉమ్మడి జిల్లాలో పెద్ద పండుగగా పిలిచే సంక్రాంతికి పెద్దలకు కొత్తబట్టలు పెట్టేందుకు.. కనుమ రోజు పశువుల పండుగ నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు. అసలు ఈ మూడు రోజుల పండుగను ఎలా జరుపుకుంటారు.. పల్లె సంప్రదాయాలు.. పండుగ వాతావరణం ఎలా ఉంటుందో మీరే చదవండి..



తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో భోగి మంటలు వేస్తున్న ప్రజలు



పెద్దలకు పెట్టిన నైవేద్యం (ఫైల్)

పెద్దలు... సూర్యదేవునికి మొక్కులు

పిండి వంటలన్నీ తయారుచేసిన అనంతరం మూడు ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మొదటగా ఇంటి ముఖద్వారం వద్ద ఐదు గుమ్మడి ఆకుల్లో పిండివంటలు, గుమ్మడికాయ కూర, బెల్లం కొద్దికొద్దిగా ఉంచి కొబ్బరికాయకొట్టి పెద్దలకు మొక్కుతారు. అనంతరం ఇంటి ముందు ఇదే తరహాలో పూజలు నిర్వహిస్తారు. ఆ తరువాత సూర్యుడు కనిపించే ప్రాంతానికి (బహిరంగ ప్రదేశానికి) నివాసంలో ఉన్న నెయ్యిదీపాన్ని, ఐదు గుమ్మడి ఆకుల్లో ఉంచిన వంటలను ఒక తట్టలో తీసుకెళ్తారు. అక్కడ సూర్యదేవునికి ప్రత్యేక పూజలు చేస్తారు. పూజ పూర్తయ్యాక నేతి దీపం ఆరకుండా నివాసంలోకి తీసుకొస్తారు. ఇదే సమయంలో కొందరు పెద్దలకు కొత్తబట్టలు పెడతారు. అదే విధంగా వాగు వద్ద పెద్దలకు తర్పణం వదులుతారు. ఇవన్నీ ఉత్తరాయణం కాలం ప్రారంభమయ్యాకే చేయడం ఆనవాయితీ.

భోగిభాగ్యాలు కలగాలని..

సంక్రాంతిలో మొదటి రోజు భోగిని జరుపుకుంటారు. వేకువజామున నిద్రలేచి ఇంటి ముందు భోగిమంట వేస్తారు. తర్వాత ఇంటి పెద్ద కొడుకు పొలానికి వెళ్లి గెరిక, గుమ్మడి ఆకులు, పూలు తీసుకొస్తారు. ఆపై తలంటు స్నానం చేసి భోగి మంటలో నుంచి నెయ్యిదీపం వెలిగించుకుని నివాసంలో నట్టింట పెడతారు. అదేవిధంగా మరో నెయ్యిదీపం నివాసం ముఖద్వారం ముందు ఈశాన్య మూల ఉంచుతారు. అక్కడే గోమూత్రం చల్లి, గోవుపేడతో నాలుగు చిన్న ముద్దలుగా చేసి పసుపు, కుంకుమ పెట్టి దానిపై గుమ్మడి పువ్వులు, గెరిక ఉంచుతారు. పొద్దుపొడవకముందే ఈ కార్యక్రమాలన్ని పూర్తి చేస్తారు. ఆ తర్వాత మళ్లీ పొలానికి వెళ్లి అడుగు భాగాన ఉన్న మట్టి, కొబ్బరి మట్టలు, మామిడి, అరటి ఆకులు సేకరించి తీసుకొస్తారు. పొలం నుంచి తెచ్చిన మట్టిని త్రిభుజాకారంలో తొమ్మిది ముద్దలుగా తయారుచేసి వాటికి ఎర్ర మట్టి, సున్నం పెట్టి మరుసటి రోజు జరిగే సంక్రాంతికి సిద్ధం చేస్తారు.

కనుమ రోజు..

మూడో రోజు కనుమ పండుగ నాడు.. పెద్దల పండుగ రోజు చేసిన కార్యక్రమాలను యథావిధిగా నిర్వహిస్తారు. పశువులు ఉన్న వారు వాటి కొమ్ములకు రంగులు వేసి గజ్జెలు, గంటలు కట్టి ముస్తాబు చేస్తారు. సాయంత్రం పశువులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పొద్దుగూకాక మట్టి పాత్రలో వండిన అన్నంలో నాటుకోడి రక్తం లేదా పొట్టేలు, మేకపోతు రక్తాన్ని కలిపి వ్యవ



వరిపైరుకు దిష్టి తీస్తున్న రైతు (ఫైల్)

సాయ పొలం చుట్టూ తిరుగుతూ దిష్టి తీస్తారు.

గొబ్బియాలు ఫేమస్

పండుగ నెల ప్రారంభమైనప్పటి నుంచి పల్లెల్లో ఇంటి ముందు గోవు పేడతో గొబ్బెమ్మను తయారు చేసి ఉంచుతారు. కొందరు మహిళలు గొబ్బెమ్మను పవిత్రంగా తయారు చేసుకుని తట్టలో ఉంచి బృందాలుగా విడిపోయి గొబ్బియాలు తట్టుతూ పాటలు పాడతారు. ఇంటింటికీ వెళ్లి సేకరించిన బియ్యం, పప్పులను కనుమ రోజు వంట చేసి భోజనం పెడతారు. కనుమ రోజు తంగేడు పూలతో ప్రత్యేకంగా పూజలు చేస్తారు. ఇలా పల్లెల్లో మూడు రోజుల పాటు తీరికలేకుండా పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

సంప్రదాయం మెండుగా..పెద్ద పండగ



సంక్రాంతి రోజు పెద్దలకు పిండి వంటల కోసం ఇంటి ముందు పొయ్యి తవ్వుతారు. దానిచుట్టూ గోమూత్రం చల్లి ఎర్రమట్టి, సున్నం పెట్టి ముగ్గువేస్తారు. అందులో వరిపొట్టు, ఎండబెట్టిన ఆవుపేడ పిడకలను ఉంచి కర్పూరం వెలిగిస్తారు. పొయ్యి చుట్టూ మట్టితో చేసిన ముద్దలు ఉంచి వాటిపై మూడు కొత్త మట్టి కుండలను ఉంచుతారు. అప్పటికే ఆ కుండలకు పల్చగా సున్నం పూసి దారంతో పసుపుకొమ్ముకడతారు. అనంతరం పొయ్యిలో కర్పూరం వెలిగించి మామిడి, వేప కర్రలతో మంటపెడతారు. మూడు మట్టికుండల్లో మొదటగా పాలు పోసి పొంగిస్తారు. తూర్పువైపుగా కొబ్బరి మట్టతో తయారుచేసి ఉంచుకున్న గరిటతో 'పచ్చా పొంగలి.. పాలా పొంగలి.. పొంగలో పొంగలి' అంటూ మూడు పర్యాయాలు పొంగును కిందకు తోస్తారు. తర్వాత ఒక కుండలో పెద్దలకు, మరో కుండలో సూర్య భగవానునికి వండుతారు. మరో కుండలో గుమ్మడి కాయ కర్రీ, తర్వాత మిగిలిన వంటకాలు తయారుచేస్తారు. వాటిని వరిగడ్డి కుదురుపై ఉంచుతారు. ఇవన్నీ వేకువ జామున ఇంటి ముఖ ద్వారం ముందు పూజచేసిన ప్రాంతంలోనే ఉంచుతారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని పొంగళ్లు అంటారు.



భోగిభాగ్యాలు కలగాలి.. సంతోషాలు నిండాలి

తిరుపతి అర్బన్: ఉమ్మడి జిల్లా ప్రజానీకానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భోగిభాగ్యాలు కలగాలని, సుఖసంతోషాలు నిండాలని, సిరి సంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో ఉపముఖ్యమంత్రి, ఎక్సైజ్, తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కే.నారాయణస్వామి, రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర పర్యాటక, యువజన క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా, తిరుపతి, చిత్తూరు ఎంపీలు గురుమూర్తి, రెడ్డెప్ప, జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, తిరుపతి, చిత్తూరు ఎస్పీలు పరమేశ్వర్‌రెడ్డి, రిషాంత్‌రెడ్డి, జేసీ డీకే బాలాజీ, డీఆర్వో శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



మంత్రులు నారాయణస్వామి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజా

వేగవంతంగా భూ సేకరణ పనులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో భూ సేకరణ పనులు వేగవంతం చేసినట్టు జేసీ వెంకటేశ్వర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి శుక్రవారం విజయవాడ నుంచి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులపై సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే లైనుల భూ సేకరణను పక్కా గా చేపడుతున్నట్లు తెలిపారు. కడప-బెంగళూరు రైల్వే లైన్‌కు సంబంధించి ఇప్పటికే సర్వే పూర్తి చేశామన్నారు. త్వరలో నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభు త్వ అనుమతి కోరినట్టు తెలిపారు. బెంగళూరు - చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేకి కౌండిన్య అటవీ ప్రాంతంలో అనుమతులకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. చిత్తూరు-నాయుడుపేట ఆరులేన్ల జాతీయ రహదారికి 1.13 కిలోమీటర్ల మేర భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయ ని వివరించారు. చిత్తూరు-తచ్చూరు రహదారికి సంబంధించి కొన్నిచోట్ల భూ సేకరణ పెండింగ్‌లో ఉందన్నారు.



భోగి మంటలు వేస్తున్న మంత్రి ఆర్కే రోజా దంపతులు

ప్రతిఇంటా ఆనందం వెల్లివిరియాలి

నగరి: ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్కేరోజా తెలిపారు. శుక్రవారం నగరి పట్టణంలోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆమె భోగి మంటలు వేసి పండగ జరుపుకున్నారు. ఆమె మాట్లాడుతూ జగనన్న పాలనలో భోగి పండగ పాతవస్తువులతో పాటు ప్రజల కష్టనష్టాలను కూడా కాల్చివేసిందన్నారు. ప్రతిఇంటా భోగి భాగ్యాలు నింపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆమె భర్త, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, కుమార్తె అన్షుమాలిక, కుమారుడు కృష్ణకౌశిక్, అన్న రాంప్రసాద్‌రెడ్డి, దత్తపుత్రిక పుష్పకుమారి పాల్గొన్నారు.

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజినీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్,హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ **85559 74855.**

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

ఎంపీడీవో కార్యాలయాల్లోనే వీడియోకాన్ఫరెన్స్

- గ్రామీణాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- జెడ్పీ నుంచి మండలాల పర్యవేక్షణ
- రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కోన శశిధర్ సూచనలు

చిత్తూరు కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందుకోసం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తోంది. సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి సేవలను ప్రజల ముంగిటకే చేరుస్తోంది. తాజాగా ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత దగ్గర చేయడంతోపాటు సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 66 మండలాల ఎంపీడీవో కార్యాలయాల్లో వీడియోకాన్ఫరెన్స్ సౌకర్యం కల్పించింది. ఇందుకోసం ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక గదిని ఏర్పాటు చేస్తున్నారు. ఏర్పాట్లపై శుక్రవారం రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కోనశశిధర్ సీఈవోలతో సమీక్షించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 66 మండలాల్లో ఏర్పాట్లను జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ హరినారాయణన్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. గ్రామీణాభివృద్ధిలో కీలకమైన మండల పరిషత్ వ్యవస్థను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ స్వరాజ్యం కోసం కృషి చేస్తోందని ప్రజలు చెబుతున్నారు. సచివాలయ వ్యవస్థతో స్థానికంగానే సమస్యలు పరిష్కరిస్తోందని పేర్కొంటున్నారు.

మరింత పకడ్బందీగా పర్యవేక్షణ



రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పలు చర్యలు తీసుకుంటోంది. పథకాల అమలుతోపాటు సమస్యలను సచివాలయ వ్యవస్థ ద్వారా స్థానికంగా పరిష్కరిస్తోంది. తాజాగా ఎంపీడీవో కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం ఏర్పాటుచేస్తోంది. తద్వారా పథకాల అమలుపై పర్యవేక్షణ మరింత పకడ్బందీగా చేపట్టవచ్చు. అధికారులతో మాట్లాడి ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెప్పించుకోవచ్చు.

– గోవిందప్ప శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్

సమయం వృథా కాదు



ఎంపీడీవో కార్యాలయాల్లో వీడియోకాన్ఫరెన్స్ సదుపాయం కల్పించడం శుభ పరిణామం. ఉన్నతాధికారుల సూచనలను ఎప్పటికప్పుడు పాటిస్తూ చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. సమయం వృథా కాదు. ఇకపై ఎంపీడీవోలు వారి కార్యాలయం నుంచే వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరుకావొచ్చు. అత్యవసర సమయాల్లో సమాచారం చేరవేసి అమలుచేయించేందుకు వీడియోకాన్ఫరెన్స్ చాలా ఉపయోగపడుతుంది.

– ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో. చిత్తూరు.

మహిళావర్సిటీ, ఇండియన్ కలినరీవర్సిటీ మధ్య ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

తిరుచానూరు: విద్యార్థుల అభ్యున్నతిని కాంక్షిస్తూ పద్మావతి మహిళా వర్సిటీ, గృహ విజ్ఞానశాస్త్రం ఇండియన్ కలినరీ వర్సిటీ శుక్రవారం ఒప్పందం చేసుకున్నాయి. మహిళావర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ రాజారెడ్డి మాట్లాడుతూ ఈ ఒప్పందం మేరకు రెండు విద్యాసంస్థల మధ్యఉన్న సదుపాయాలను విద్యార్థుల కోసం వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఈ ఒప్పందం రెండు విద్యాసంస్థల రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు ఉంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మహిళావర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రజిని, గృహవిజ్ఞానశాస్త్రం హెచ్‌ఓడీ అరుణ, పీఆర్‌ఓ రజని, ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్ అకడమిక్ ఇన్‌చార్జ్ డాక్టర్ ఎం.త్రిలోక్‌చంద్, ఫ్యాకల్టీ డాక్టర్ లోంతే దైలత్రావు పాల్గొన్నారు.

జల్లికట్టు, కోడి పందేలు నిషేధం

చిత్తూరు అర్బన్: జిల్లాలో ఎక్కడా జల్లికట్టు, కోడిపందేలు నిర్వహించడానికి వీల్లేదని చిత్తూరు జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశించారు. ఆయన శుక్రవారం జిల్లాలోని పోలీసు అధికారులతో సెట్ కాన్ఫరెన్సులో మాట్లాడారు. జంతు సంక్షేమ సిబ్బంది, రెవెన్యూ అధికారులతో కలిసి పోలీసులు గ్రామాల్లో పర్యటించి జల్లికట్టు, కోడి పందేలు నిర్వహించకుండా అవగాహన కల్పించాలని సూచించారు. డీఎస్పీలు అప్రమత్తంగా ఉండి అనుమానం ఉన్న వాళ్లను బైండోవర్ చేసుకోవాలన్నారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘిస్తే డయల్ 100, పోలీసు వాట్సాప్ 9440900006కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. పండుగ సందర్భంగా ఊర్లకు వెళ్లే వారు తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తాళం వేసిన ఇళ్లలో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా నిఘా పెట్టడం వల్ల చోరీలను నివారించవచ్చని ఎస్పీ తెలిపారు.

వసతి గృహ సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గం



డీడీని కలిసిన వసతి గృహ సంక్షేమ సంఘం నూతన జిల్లా కార్యవర్గ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో శుక్రవారం వసతి గృహ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా విజయ్‌భాస్కర్‌రెడ్డి(పుంగనూరు), ప్రధాన కార్యదర్శిగా బాలమురుగన్ (బైరెడ్డిపల్లి), ట్రెజరర్‌గా శ్రీకాంత్‌రెడ్డి (చిత్తూరు), గౌరవ అధ్యక్షుడిగా ధనుంజయరెడ్డి (నగరి), అసోసియేషన్ అధ్యక్షుడిగా రమేష్ (కొత్తపల్లిమిట్ట), పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజ్యలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

ఎర్రావారిపాళెం: రహస్యంగా కోడిపందేలు ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ ప్రకాష్ తెలిపారు. శుక్రవారం వచ్చిన సమాచారం మేరకు మండలంలోని పుట్టావానిపల్లె సమీపంలో కోడిపందేల స్థావరాలపై దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో 9 మందిని అరెస్టు చేసి మూడు కోళ్లు, రూ.10,040 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. సంక్రాంతి సందర్భంగా పందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సామాన్య భక్తుల గదుల అద్దె యథాతథం

- వీఐపీ, వీవీఐపీల అద్దె గదుల ధరలే పెంచాం
- డయల్ యువర్ ఈఓలో ఏవీ ధర్మారెడ్డి



డయల్ యువర్ ఈఓలో భక్తులతో మాట్లాడుతున్న ఈఓ ధర్మారెడ్డి, ఉన్నతాధికారులు

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే సామాన్య భక్తులకు టీటీడీ పెద్దపీట వేస్తోందని ఈఓ ఏవీ.ధర్మారెడ్డి తెలిపారు. తిరుమలలో అద్దె గదుల ధరలు పెంచామని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. సామాన్య భక్తులకు కేటాయించే అద్దె గదుల ధరలు యథావిధిగానే ఉంచామని, వీఐపీలకు కేటాయించే అద్దె గదుల ధరలను మాత్రమే పెంచామని ఆయన వెల్లడించారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం డయల్ యువర్ ఈఓ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అడిగిన ప్రశ్నలకు ఈఓ సమాధానాలు ఇచ్చారు.

- **ప్రశ్న : తిరుమలలో సామాన్య భక్తులు బస చేసే రూ.50, రూ.100 గదుల అద్దె పెంచకండి.**
- **ఈఓ** : తిరుమలలో దాదాపు 45 వేల మందికి వసతి కల్పిస్తున్నాం. 75 శాతం గదులను సామాన్య భక్తులకే కేటాయిస్తున్నాం. వారికి కేటాయించే గదుల అద్దె పెంచలేదు. ఇక మీదట కూడా పెంచే ఆలోచన లేదు. వీఐపీలకు కేటాయించే 172 అతిథి గృహాల అద్దె మాత్రమే పెంచాం.
- **ప్రశ్న : ఎస్వీబీసీలో శ్రీవారి సేవలు ఇప్పటికే రికార్డ్ చేసినవి ప్రసారం చేస్తున్నారు. ఆకర్షణీయంగా ఉండేలా కొత్త విజువల్స్ ప్రసారం చేయండి.**
- **ఈఓ** : తిరుపతిలో శ్రీవారి నమూనా ఆలయం ఉంది. శ్రీవారి ఆలయంలో ఏ విధంగా అయితే స్వామివారి సేవలు, కైంకర్యాలు నిర్వహిస్తారో, అదే విధంగా నమూనా ఆలయంలో కూడా నిర్వహించి రికార్డ్ చేసినవి ప్రసారం చేస్తున్నాం. తాజా విజువల్స్ అందించే చర్యలు తీసుకుంటాం.
- **ప్రశ్న : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం, అన్న ప్రసాదం నాణ్యత బాగాలేదు.**
- **ఈఓ** : రోజూ శ్రీవారి లడ్డూ ప్రసాదాలు, అన్నప్రసాదాలను తిరుమలలోని నాణ్యతా ప్రమాణాల ల్యాబ్‌లో పరిశీలిస్తాం. మరింత రుచికరమైన, నాణ్యమైన లడ్డూ ప్రసాదం, అన్న ప్రసాదం అందించేందుకు చర్యలు తీసుకుంటాం.
- **ప్రశ్న : తిరుమల శ్రీవారి ఆలయం మూసివేస్తారన్నారు నిజమేనా?**
- **ఈఓ** : ఆనంద నిలయం బంగారు తాపడం పనులు చేపడుతున్నందువల్ల ఈ వదంతులు వస్తున్నాయి. వీటిని నమ్మవద్దు.
- **ప్రశ్న : తిరుమలలో శ్రీవారి కల్యాణం చేయించాం. రెండు చిన్న లడ్డూలు మాత్రమే ఇచ్చారు. కల్యాణోత్సవం లడ్డూ, వడ ఇవ్వలేదు.**
- **ఈఓ** : సేవల్లో పాల్గొన్న, దర్శనం చేసుకున్న ప్రతి భక్తుడికీ ఒక లడ్డూ అందిస్తున్నాం. పెద్ద లడ్డూ, వడ రుసుము చెల్లించి తీసుకోవాలి. వడలు ఎక్కువ తయారు చేయించేందుకు ప్రయత్నిస్తున్నాం.
- **ప్రశ్న : లడ్డూ కౌంటర్లలో టీటీడీ ఉద్యోగస్తులు దూరుతున్నారు. కౌంటర్ల సంఖ్య పెంచండి?**
- **ఈఓ** : ప్రస్తుతం తిరుమలలో 50 లడ్డూ కౌంటర్లు పనిచేస్తున్నాయి. ఇందులో రెండు కౌంటర్లు టీటీడీ ఉద్యోగులకు కేటాయించాం. త్వరలో మరో 25 కౌంటర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
- **ప్రశ్న : జనవరి రెండో తేదీ శ్రీవాణి టికెట్టు ద్వారా వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నాం. కానీ మాధవంలో వసతి అడిగితే తిరుమలలో తీసుకోవాలని అన్నారు. తిరుమలకు వచ్చి సీఆర్వోలో అడిగితే పద్మావతికి వెళ్లమన్నారు, పద్మావతి విచారణ కేంద్రంలో అడిగితే అమర్యాదగా మాట్లాడారు. అదేవిధంగా తిరుచానూరు అమ్మవారి దర్శనం కోసం రూ.500 వేద ఆశీర్వాదం టికెట్ అడిగితే అక్కడ సిబ్బంది అమర్యాదగా ప్రవర్తించారు.**
- **ఈఓ** : ఆ సమయంలో సీసీటీవీ పుటేజ్ పరిశీలించి ఆ ప్రాంతాల్లో విధులు నిర్వహించిన ఉద్యోగులపై చర్యలు తీసుకుంటాం.
- **ప్రశ్న : ఫిబ్రవరి నెల శ్రీవారి సేవా టికెట్లు విడుదల చేయలేదు, కానీ వసతిని విడుదల చేశారు. మేము ఏ విధంగా బుక్ చేసుకోవాలి?**
- **ఈఓ** : రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, సేవా టికెట్లు, దర్శనం టికెట్లు, వసతి ఒకేసారి విడుదల చేసేలా చర్యలు తీసుకుంటాం.

కుప్పంలో ముగ్గురు స్టాంప్ వెండర్స్ లైసెన్సుల సస్పెన్షన్

చిత్తూరు కార్పొరేషన్: కుప్పంలో స్టాంప్ పేపర్లను అధిక ధరకు విక్రయిస్తున్న ముగ్గురు వెండర్స్ లైసెన్సులను సస్పెండ్ చేసినట్టు జిల్లా రిజిస్ట్రార్(డీఆర్) శ్రీనివాసరావు తెలిపారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సబ్‌రిజిస్ట్రార్లు గురువారం చిత్తూరు జిల్లాలోని ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. స్టాంప్ పేపర్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్న 24 మంది వెండర్స్‌పై కేసులు నమోదు చేశారు. కుప్పంలో రూ.50 స్టాంప్ పేపర్‌ను రూ.100 అమ్ముతున్న ముగ్గురు వెండర్స్‌పై నివేదికను సబ్‌రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య జిల్లా రిజిస్ట్రార్(డీఆర్) శ్రీనివాసరావుకు అందజేశారు. దీంతో డీఆర్ వెంటనే స్టాంప్ వెండర్స్ ఎన్.రాజేష్, ఎం.ఎ.నెపోలియన్, టి.సోమసుందరం లైసెన్సులను సస్పెండ్ చేశారు. త్వరలో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు. వారి వివరణ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సరైన సమాధానం ఇవ్వకపోతే లైసెన్సును పూర్తిగా రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం వారు స్టాంప్ పేపర్స్ విక్రయించడానికి వారికి అర్హత లేదని, వారి అమ్మకాల రికార్డ్స్‌ను సబ్‌రిజిస్ట్రార్‌కు అందజేయాలన్నారు.

కోకోలు గార్డెన్స్‌లో చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న నిపుణులు, సీఐ

చిల్లకూరు: మండల కేంద్రమైన చిల్లకూరులోని కోకోలు గార్డెన్స్‌లో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లోకి చొరబడి విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం చుట్టుపక్కల వారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో గూడూరు రూరల్ సీఐ దశరథరామారావు, ఎస్‌ఐ గోపాల్‌తో పాటు క్లూస్‌టీం సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలను సేకరించింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కోకోలు గార్డెన్స్‌లో నివాసముంటున్న మహిధర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లారని, ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ప్రతిగదిలోనూ ఉన్న బీరువా తాళాలను పగులగొట్టి విలువైన వస్తువులు చోరీచేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ మేరకు విచారణ చేపట్టినట్టు సీఐ తెలిపారు.

ప్రమాదం వెంట ప్రమాదం

కోట: మండలంలోని రంగన్నగుంట వద్ద ప్రధాన రహదారిపై శుక్రవారం క్షణాల వ్యవధిలోనే ప్రమాదం వెంట ప్రమాదం చోటుచేసుకుని నలుగురు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. వాకాడుకు చెందిన మహేష్ మోటార్‌బైక్‌లో కోటకు వస్తుండగా అదుపుతప్పి కిందపడి గాయపడ్డాడు. ఇంతలో వెనుకనే వస్తున్న ఆటో రోడ్డుపై పడి ఉన్న అతడి బైక్‌ను ఢీకొని బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న వరలక్ష్మి, కస్తూరమ్మ, రమణయ్య కూడా గాయపడ్డారు. వారిని కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ముగిసిన నీరాటోత్సవాలు

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో వెలిసిన ఆండాళ్ అమ్మవారి నీరాటోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ నెల 7నుంచి ఆరంభమైన అమ్మవారి నీరాటోత్సవాలు వారం రోజులు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం ఆండాళ్ అమ్మవారు బంగారు తిరుచ్చిపై గోవిందరాజస్వామి ఆలయం నుంచి శ్రీరామచంద్ర తీర్థకట్టకు ఊరేగింపుగా వేంచేశారు. అక్కడున్న మండపంలో అమ్మవారిని కొలువు తీర్చి వేడి నీళ్లతో అభిషేకం చేశారు. సాయంత్రం వరకు అమ్మవారు అక్కడే ఉండి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆండాళ్ అమ్మవారు బంగారు తిరుచ్చిపై కొలువు తీరి కోదండరామాలయం చుట్టూ ప్రదక్షిణ చేసి గోవిందరాజస్వామి ఆలయానికి చేరుకున్నారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ప్రతి ఏటా ధనుర్మాసంలో ఆండాళ్ అమ్మవారు స్వామివారి కోసం చేసిన తపస్సుకు ప్రతీకగా ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వీఆర్.శాంతి, ఏఈవో రవికుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్‌మూర్తిరాజు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో 'కొక్కొరొక్కో'



కోడి పందేలరాయుళ్ల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్ శనివారం రాత్రి కోడిపుంజుల కొక్కొరొక్కో కూతలు పాదచారులను ఆకర్షించాయి. అవేం కూశాయంటే... మండలంలోని మంగళపాడు గ్రామ అటవీ ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో శనివారం సాయంత్రం ఎస్‌ఐ రవిబాబు తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. దీంతో కొందరు పిక్కబలం చూపి పరుగో.. పరుగు..! పోలీసులు వెంటాడి కోడిపుంజులతో సహా నలుగురిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.2200 స్వాధీనం చేసుకున్నారు. నిందితులతో సహా పుంజులను పోలీస్ స్టేషన్‌కు తేవడంతో అవి కూతలేస్తూ పందేల యవ్వారాన్ని చెప్పకనే చెప్పాయి. అవి పదే పదే కూతలేస్తుండడంతో వాటిని స్థానికంగా నాటుకోళ్ల పెంపకందారుల వద్దకు తరలించారు.

రెజ్లింగ్ పోటీల్లో వడమాలపేట విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులు

వడమాలపేట : రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో వడమాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు పతకాలు సాధించారని హెచ్‌ఎం భువనేశ్వరి తెలిపారు. ఆమె శుక్రవారం విద్యార్థులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం దిమ్మగుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12, 13 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ – 17 రెజ్లింగ్ ఫ్రీ స్టైల్ విభాగంలో ఉదయ్‌కుమార్ (10వ తరగతి) 71 కేజీల విభాగంలో బంగారు పతకం, 60 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించారని పేర్కొన్నారు. మన్సూర్‌ఆలం (10వ తరగతి) 60 కేజీల విభాగంలో బంగారు పతకం, గ్రీగ్రో రోమన్‌లో యూనస్ (9వ తరగతి) 55 కేజీల్లో వెండి పతకం, జయకుమార్ (10వ తరగతి) 60 కేజీల్లో , దర్శన్ (10వ తరగతి) కాంస్య పతకాలు సాధించారని వివరించారు.

పోక్సో కేసుల నిందితులపై రౌడీషీట్లు

- కళాశాలల వద్ద డ్రగ్స్ వినియోగంపై నిఘా
- చిత్తూరు, తిరుపతి ఎస్పీలకు డీఐజీ ఆదేశం



మాట్లాడుతున్న డీఐజీ రవిప్రకాష్

చిత్తూరు అర్బన్: పోక్సో కేసుల నిందితులు అదే తరహా నేరాలకు పాల్పడినట్లయితే రౌడీషీట్లు తెరవాలని అనంతపురం రేంజ్ డీఐజీ రవిప్రకాష్ ఆదేశించారు. ఆయన శుక్రవారం అనంతపురం నుంచి చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎస్పీలు రిషాంత్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డితో టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి డీఎస్పీ పోక్సో కేసుల విచారణలో జాప్యం లేకుండా న్యాయస్థానాల్లో వెంటనే సాక్ష్యాధారాలతో సహా చార్జ్‌షీట్లు దాఖలు చేయాలన్నారు. పెండింగ్ కేసులు 50 శాతం కంటే తక్కువగా ఉండేలా చూడాలన్నారు. కళాశాలల వద్ద డ్రగ్స్ విక్రయాలు, వినియోగించడంపై నిఘా పెట్టాలని, నిందితులపై ఉక్కుపాదం మోపాలని పేర్కొన్నారు. అలాగే డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. అసాంఘిక, సంఘ విద్రోహ శక్తులను ఉపేక్షించొద్దన్నారు. సంక్రాంతి నేపథ్యంలో జల్లికట్టు, కోడి పందేలు, బెట్టింగులు, జూదం జరగకుండా చూడాలని ఆదేశించారు.

ఓడూరుకు అంతిమ వీడ్కోలు



పాడె మోస్తున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తదితరులు

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాతో నివాళి
- మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి

నాయుడుపేట: స్థానిక మంగపతినాయుడు నగర్‌లో శుక్రవారం వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఓడూరు సుందరరామిరెడ్డికి కన్నీటి నివాళులతో అంతిమయాత్ర నిర్వహించారు. ఆయన అనారోగ్యంతో గురువారం మరణించడం విదితమే. శుక్రవారం అంతిమయాత్రలో డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి పాల్గొని సుందరరామిరెడ్డికి నివాళులు అర్పించారు. సుందరరామిరెడ్డి కుమారుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఓడూరు గిరిధర్‌రెడ్డిని డిప్యూటీ సీఎం పరామర్శించారు. తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంఎల్‌సీ కల్యాణ్ చక్రవర్తి తదితరులు పాడె మోసి సుందరరామిరెడ్డికితో తమకు ఉన్న ఆత్మీయత చాటారు. అంతిమయాత్రలో చంద్రగిరి ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, కర్నూలు సెంట్రల్ బ్యాంకు చైర్మన్ జీవీ సూర్యప్రకాష్‌రెడ్డి, రామాయపట్నం పోర్ట్ ఎండీ ప్రతాప్‌రెడ్డి, సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, శ్రీకాళహస్తి ఆలయ చెర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మెన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, చదలవాడకుమార్, రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, చైతన్య క్రిష్టారెడ్డి, అన్నమనేని రామక్రిష్ణ, డీఎస్పీలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ప్రముఖులు, పార్టీ నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలపై పోలీసుల నిఘా



దొరవారిసత్రం: మండలంలో కోడి పందేల స్థావరాలపై స్థానిక పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. అందులో భాగంగా శుక్రవారం ఎస్‌ఐ తిరుమలరావు సిబ్బందితో కలిసి అయ్యపాళెం, మేలుపాక, వెదురుపట్టు, మోదుగులపాళెం, మీజూరు, శ్రీదనమల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. గతంలో పట్టుబడిన పలువురు జూదర్లను బైండోవర్ చేశారు.

నాయుడుపేటలో...

నాయుడుపేటటౌన్: కోడి పందేలు ఎక్కడా జరపకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ రావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎస్‌ఐలు టీసీ కృష్ణయ్య, కె.శ్రీకాంత్, వేణుగోపాల్ పోలీసులు, గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసులతో కలిసి మండలంలోని గ్రామాల్లో పహారా కాస్తున్నట్లు వెల్లడించారు.







క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ హరి

తవణంపల్లె: ఆర్‌టీఐఏఎస్ రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం తవణంపల్లె ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, ఎస్ఐ ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు హరికృష్ణారెడ్డి, మధుకుమార్ చేతులు మీదుగా వేర్వేరుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌టీఐఏఎస్ మండల అధ్యక్షుడు గజేంద్ర, నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు గణపతి, కార్యదర్శి సీడీ శేఖర్, హేమచంద్ర పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

చిత్తూరు రూరల్: మండలంలోని అనంతాపురంలో ఐదుగురు జూదరులను శుక్రవారం బీఎస్‌ఆర్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. రహస్య సమాచారం మేరకు బీఎస్‌ఆర్‌పేట పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.3,250 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

జెడ్పీలో క్రీడా పోటీలు



క్రీడల్లో పాల్గొన్న ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ కార్యాలయంలో ముందస్తు సంక్రాంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లో తీసుకెళుతున్న ఉద్యోగులపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు తెలిపారు. ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడంతో ఉద్యోగుల్లో ఆహ్లాద, స్నేహపూరిత వాతావరణం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పంటలను రక్షించుకోవాలి



జంగాలపల్లెలో పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

యాదమరి: పంట పొలాలపై తామర పురుగుల దాడి ఎక్కువైందని, వాటి నుంచి పంటను రక్షించుకునేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉందని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ గోపాల్, ఏడీఏ నాగపద్మిని అన్నారు. శుక్రవారం సాయంత్రం వారు మండలంలోని జంగాలపల్లె పంచాయతీలోని రైతులు సాగు చేసిన పంటలను వారు పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ రైతులు సాగు చేసిన వేరుశనగ, మిరప పంటలపై తామర పురుగుల దాడి ఎక్కువ అయ్యిందన్నారు. జిల్లా వనరుల ఏఓ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

ఐరాల: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించే దిశగా ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది పని చేయాలని ఎంపీడీఓ నిర్మలాదేవి సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన ప్రతి పేదవాడికి పని కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి కూలీలకు తప్పనిసరిగా మౌలిక వసతులు కల్పించాలన్నారు. గ్రామాల్లో ప్రజా ప్రయోజన పనులును గుర్తించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

ఇంటింటా వైద్య సేవలు



రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

యాదమరి: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో ప్రతి ఇంటికి వచ్చి వైద్య సేవలు అందిస్తామని వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కీనాటంపల్లె ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని గ్రామీణ ప్రజలకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి నెలలో రెండో శుక్రవారం మీ గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించి, వైద్యసేవలు అందిస్తామని తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో 14 రకాల పరీక్షలు చేసి, 67 రకాల మందులు ప్రజలకు ఉచితంగా అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆహారం.. హరిస్తోంది ఆరోగ్యం

- విచ్చలవిడిగా సింథటిక్ కలర్, టేస్టింగ్ సాల్ట్ వాడకం
- బేకరీలు, స్వీట్ స్టాళ్లు, రెస్టారెంట్లలో అధికం
- నామమాత్రంగా దాడులు

ఆహారం అంటే అమృతం. జీవక్రియకు ఇదే ఆధారం. అయితే నిల్వ ఉంచిన, రసాయనాలు కలిపిన ఆహారం కొన్నిసార్లు విషంగా మారుతుంది. ప్రస్తుతం కాకా హోటళ్ల నుంచి స్టార్ హోటళ్ల వరకు అన్నిటా శుభ్రం లేని తిండి తినే భోజనప్రియుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది.



మండీ బిర్యానీ



చిత్తూరులోని ఓ బజ్జీకొట్టులో అపరిశుభ్రంగా పరిసరాలు



చిత్తూరు పట్టణంలోని ఓ హోటల్‌లో తయారు చేసిన గ్రిల్, తందూరీ చికెన్

చిత్తూరు కార్పొరేషన్: కాలానుగుణంగా మారుతున్న అలవాట్లు, తీరికలేని జీవితంతో ప్రస్తుతం ఇంట్లో విందు భోజనాలు చేసుకునే తీరిక లేక, పలు వెరైటీలు చేయడం రాక అధిక సంఖ్యలో జనం హోటళ్లు, రెస్టారెంట్లకు వెళుతున్నారు. ఆ సమయంలో ఎక్కువగా మాంసాహారానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఓ సర్వే ప్రకారం ఎక్కువ మంది వారంలో రెండు రోజులు మాంసాహారం తింటున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇబ్బడి ముబ్బడిగా హోటళ్లు పెరుగుతున్నాయి. ఈ పోటీని తట్టుకోవడంతోపాటు భోజనప్రియులను ఆకట్టుకోవడానికి హోటళ్ల యజమానులు నిబంధనలకు నీళ్లు వదిలి, అధికంగా హానికర పదార్థాలను ఆహార తయారీలో వాడుతున్నారు. అయినా ఆహార తనిఖీ శాఖ చోద్యం చూస్తూ నామ మాత్రంగా దాడులు చేస్తోంది. జిల్లాలో ఏడాది కాలంలో 140 పైగా తనిఖీలు చేస్తే అందులో కేవలం 14 కేసులు మాత్రమే నమోదు చేయడమే ఇందుకు నిదర్శనం.

పరిశుభ్రత కరువు

జిల్లాలో చిన్నాపెద్ద హోటళ్లు వేలలోనే ఉన్నాయి. వీటికి తోపుడు బండ్లు, రోడ్డు పక్కన కాలువ గట్లపై ఉన్న క్యాంటిన్లు అదనం. వీటిలో చాలావరకు శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. వినియోగదారుల ఆరోగ్యం విషయంలో కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. ముందురోజు మిగిలిన ఆహార పదార్థాలను ఫ్రిజ్‌ల్లో నిల్వ చేయడం, మరుసటి రోజు దాన్నే వేడి చేసి విక్రయిస్తున్నారు. ఇక హోటళ్లలో వంటశాలలను చూస్తే అసలు భోజనమే చేయలేం. కనీసం తాగునీటిని సైతం శుభ్రంగా ఉంచడం లేదు.

నిల్వ పదార్థాలతో ముప్పు

నిల్వ ఉంచిన మాంసం, గుడ్లు, సరిగా ఉడకని ఆహార పదార్థాలు తీసుకోవడంతో సాల్మొనిల్లా అనే బ్యాక్టీరియా సోకుతుంది. దీంతో విరేచనాలు, కడుపునొప్పి, జ్వరం, తలనొప్పి వంటి వ్యాధులు వచ్చి, ఆస్పత్రి పాలవుతారు.

యథేచ్ఛగా కల్తీ

చిరు హోటళ్లు మొదలు, రెస్టారెంట్లు సైతం కల్తీ ఆహార పదార్థాలు కల్తీ జరుగుతున్నట్లు ఇటీవల అధికారుల తనిఖీల్లో బట్టబయలైంది. కానీ చర్యలు నామమాత్రంగా ఉన్నాయి. సింథటిక్ కలర్‌లు జ్యూస్, ఐస్‌క్రీమ్, స్వీట్స్, కేక్, బేకరి పదార్థాలకు మాత్రమే పరిమితంగా వాడాలి. కానీ వాటిని బిర్యానీ, రైస్, ఫాస్ట్‌ఫుడ్, కబాబ్, తందూరీ, గ్రిల్ చికెన్‌కు అధికంగా వాడుతున్నారు. అలాగే టేస్టింగ్ సాల్ట్(అజినోమోటో)ను మితంగా వాడాలి. కానీ రుచి కోసం గోబి, చికెన్, సాంబారు, ఫాస్ట్‌ఫుడ్స్‌లో ఎక్కువగా వాడుతున్నారు. ఇవి ఎక్కువగా తింటే జీర్ణకోశ వ్యాధులు, కేన్సర్, సంతానలేమి సమస్యలు వస్తాయని వైద్యనిపుణులు చెబుతున్నారు.

చట్టం ఏమి చెబుతోందంటే...

ఆహార పదార్థాల్లో కల్తీని నిరోధించేందుకు 2006లో ఫుడ్‌సేఫ్టీ స్టాండర్డ్ యాక్ట్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. ఆహార పదార్థాల తయారీ, అనుమతితో పాటు నిల్వ పంపిణీ, విక్రయాలు, ప్రజల వినియోగం, జాగ్రత్తలపై ప్రమాణాలను ఈ చట్టం నిర్దేశిస్తోంది. పరిశుభ్రత లేని ఆహారాన్ని తయారు చేసినా, అమ్మినా ఫుడ్‌సేఫ్టీ స్టాండర్డ్ యాక్ట్–2006 చట్టం కింద శిక్షించే అధికారం ఉంది. కానీ పలు ప్రాంతాల్లో ఎటువంటి అనుమతులు లేకుండానే హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, దుకాణాలు ఏర్పాటు చేసుకొని విచ్చలవిడిగా ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారు.

టోల్ ఫ్రీతో ఫిర్యాదు

పలువురికి వీటిపై ఎలా ఫిర్యాదు చేయాలో అవగాహన లేదు. ఆహార సమస్యలపై టోల్ ఫ్రీ నంబరు 1800 425 3857కు తెలుపవచ్చు. అలాగే వెబ్‌సైటు ద్వారా **www.foscos.fssai.gov.in**, యాప్ ద్వారా అయితే **foodsafetyconnect** లో ఫిర్యాదు చేయవచ్చు.

లైసెన్స్ తీసుకోవాలి



పానిపూరీ, బజ్జీకొట్టు, రెస్టారెంట్, హోటల్, మ్యానుఫ్యాక్చర్, రీ పేకర్స్ వరకు అందరూ ఫుడ్ లైసెన్స్ తీసుకోవాలి. వారి టర్నోవర్‌ను ఆధారంగా ఫీజు ఉంటుంది. ఆన్‌లైన్‌లోనే లైసెన్స్ ఇస్తాం. ఆహార తయారీదారులు నాణ్యత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి, లేని పక్షంలో జరిమానాతో పాటు జైలుశిక్ష తప్పదు. ఎటువంటి సమస్యలున్నా టోల్ ఫ్రీ నంబరు, వెబ్‌సైటు, యాప్, కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు.

–సతీష్‌కుమార్, జిల్లా ఆహార తనిఖీ అధికారి

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



చెక్కును ఆలయాధికారులకు అందజేస్తున్న దాత

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన రమణ శుక్రవారం రూ.లక్ష విరాళం ఇచ్చారు. మధ్యాహ్నం ఆయన స్వామివారి దర్శనార్థం కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేశారు. ఏఈఓ విద్యాసాగర్ రెడ్డిని కలసి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వాలి

చిత్తూరు అర్బన్: మున్సిపల్ కార్పొరేషన్‌లో క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) ఏజెన్సీలో పనిచేస్తున్న ఆటో డ్రైవర్ల వేతనాలు ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు కోరారు. శుక్రవారం కార్మికులతో కలిసి కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో నిరసన తెలిపారు. ఏఐటీయూసీ నాయకులు గోపినాథ్, మణి, సత్యమూర్తి, అజీమ్‌బాషా, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విరూపాక్షి మారెమ్మకు పూజలు

పుంగనూరు: పట్టణంలోని శ్రీవిరూపాక్షి మారెమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే చలిని సైతం లెక్కచేయకుండా భక్తులు అధిక సంఖ్యలో హాజరై, చలిపిండి, చల్లముద్దతో దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించారు. ఉదయం 10–30 నుంచి 12 గంటల వరకు రాహుకాల సమయంలో విశేష పూజలు జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా పప్పు దినుసులు పరిమళ భరిత పుష్పమాలికలతో అలంకరించారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

చిత్తూరు రూరల్: సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య సిబ్బంది తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి ప్రకాశం ఆదేశించారు. చిత్తూరు నగరం పెద్ద హరిజనవాడలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆ ప్రాంతంలో పర్యటించి, దోమల నివారణకు చర్యలు తీసుకున్నారు. పరిశుభ్రత పాటించాలని సూచించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ అముద, జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ లోకేష్, మెడికల్ ఆఫీసర్ శివకుమార్, పీర్ సాహెబ్, సిబ్బంది లోకనాథం, ప్రతాప్, నారాయణ, గోపి, వసంత, ఆశ పాల్గొన్నారు.



పెద్దహరిజనవాడలో అధికారులతో మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్ఓ

ఆరోగ్య సూత్రాలు పాటిదాం.. క్షయను నివారిద్దాం

పూతలపట్టు: ఆరోగ్య సూత్రాలను పాటించి, క్షయ వ్యాధిని నివారిద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి. ప్రకాశం, జిల్లా క్షయ నివారణ అధికారి రవిరాజు పిలుపునిచ్చారు. పూతలపట్టు మండలం పి.కొత్తకోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిశ్చయ పోషణ అభియాన్‌లో భాగంగా క్షయ బాధితులు 40 మందికి పోషకాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 1,565 మంది క్షయ బాధితులు ఉన్నారన్నారు. బాధితులు వైద్యుల సూచనల మేరకు మందులు వాడడంతోపాటు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పావని, చంద్ర, ప్రసాద్ రెడ్డి, శ్రావణి, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

బైరెడ్డిపల్లె: సీజనల్ వ్యాధులపై గ్రామీణులను అప్రమత్తం చేయాలని ఆరోగ్యసిబ్బందికి డిప్యూటీ డీఎం అండ్‌హెచ్ఓ హరినాథరెడ్డి సూచించారు. మండలంలోని తీర్థం పీహెచ్‌సీ పరిధిలోని దేవదొడ్డిలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. ఉదయం 9 గంటలకే ఓపీ సేవలను ప్రారంభించాలని తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

చిత్తూరు అర్బన్: నగరంలోని దుర్గానగర్ కాలనీలో జరిగిన చోరీ కేసులో రంజిత్‌కుమార్ (27), మురుగన్ (42) అనే ఇద్దరిని టూటౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. దుర్గానగర్‌కు చెందిన బాలమురళి అనే వ్యక్తికి మూడంస్తుల భవనం ఉంది. ఆయన ఈనెల 9వ తేదీన మొదటి అంతస్తులో నిద్రించాడు. అయితే రెండో అంతస్తులోని గదిలో ఉంచిన 45 గ్రాముల బంగారం, 120 గ్రాముల వెండి ఆభరణాలు చోరీ జరిగాయి. ఈ విషయమై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన ఎస్ఐ మల్లికార్జున సాంకేతి పరిజ్ఞానం తో తమిళనాడులోని వేలూరుకు చెందిన రంజిత్‌కుమార్, మురుగన్‌ను చిత్తూరు కలెక్టరేట్ కూడలి వద్ద అరెస్టు చేసి, నిందితుడి నుంచి రూ.2 లక్షల విలువైన నగలు స్వాధీనం చేసుకున్నారు.

లబ్ధిదారులకు రూ.5 లక్షలు ఇవ్వాలి

చిత్తూరు కార్పొరేషన్: పేదల ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు అన్నారు. ఫిబ్రవరి 22వ తేదీన విజయవాడలో జరిగే మహాధర్నా పోస్టర్లను శుక్రవారం ఆయన నగరంలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చక్కటి ఆలోచనలతో పేదలకు ఇళ్ల స్థలాలను ఇస్తోందన్నారు. లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాల కోసం రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ మహాధర్నా చేయనున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, సుబ్రమణ్యం, జనార్దన్, రామ్మూర్తి పాల్గొన్నారు.

సంక్రాంతిని ప్రశాంతంగా జరుపుకోవాలి

చిత్తూరు రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా గొడవలు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని బీఎస్‌ఆర్‌పేట ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి సూచించారు. చిత్తూరు మండలంలోని పలు గ్రామాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలన్నారు. ఇందుకు విరుద్ధంగా కోడి పందెలు, పేకాట నిర్వహిస్తే ఊరుకునేది లేదన్నారు. తాగి వీధుల్లో రచ్చ చేయడం, మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించడం చేస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మూడు రోజుల పాటు గ్రామస్తులంతా కలిసి మెలసి ప్రశాంతంగా పండుగను జరుపుకోవాలని సూచించారు.

సంతోషంగా జరుపుకోవాలి

తవణంపల్లె: మండలంలోని ప్రజలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రశాంత వాతావరణంలో సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని తవణంపల్లె ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం తవణంపల్లె పోలీస్ స్టేషన్ ఎదుట ఆయన వాహనాలను తనిఖీ చేశారు. సరైన రికార్డులు లేని వాహనాలకు, హెల్మెట్ ధరించకుండా, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానా విధించారు. ద్విచక్రవాహనచోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకు పంపుతామని హెచ్చరించారు. మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. పల్లెలో కోడిపందేలు, జల్లికట్టు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

గోదారంగనాథ కల్యాణోత్సవం నేడు

చిత్తూరు రూరల్: శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శ్రీ గోదారంగనాథ స్వామి కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ చైర్మన్ వెంకటేష్‌గుప్తా, సభ్యులు రాజా, అర్చకులు వేణుగోపాల్ కోరారు. చిత్తూరులోని కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ధనుర్మాసం పురస్కరించుకుని శనివారం ఉదయం 6 గంటలకు నీరాటోత్సవం, సాయంత్రం 4 గంటలకు కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్వామివారికి పట్టువస్త్రాల సమర్పిస్తారని, భక్తులు విరివిరిగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న ఆలయ నిర్వాహకులు

జల్లికట్టు, కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

యాదమరి: మండలంలో ఎవరైనా జల్లికట్టు, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సుమన్ హెచ్చరించారు. సంక్రాంతి సందర్భంగా మండలంలోని గ్రామాల్లో ఎవరైనా అనుమతి లేకుండా జల్లికట్టు, కోడి పందేలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాలు, సరిహద్దు గ్రామాల్లో ఎవరైనా కోడి పందేలు నిర్వహిస్తే 94409 00684కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

జూదం ఆడితే కఠిన చర్యలు తప్పవు

ఐరాల: సంక్రాంతి పండుగ వేళ కోడి పందేలు, జూదం ఆడినా, నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ సంప్రదాయ క్రీడలను నిర్వహించుకోవచ్చన్నారు. మండల వ్యాప్తంగా పోలీసు నిఘా ఉంటుందన్నారు. కోడిపందేలు, జూదం నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

పల్లెకు సంక్రాంతి శోభ



చిత్తూరు నగరం చర్చివీధిలో జన సందడి

చిత్తూరు రూరల్: పల్లెను పండుగ వాతావరణం అలుముకుంది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు సంక్రాంతి పండక్కి పల్లె బాటపడుతున్నారు. వీరి రాకతో పల్లె వాకిళ్లు వర్ణ కాంతులతో కళకళలాడుతున్నాయి. ఇంటింటా సందడి నెలకొంది. శనివారం భోగి, ఆదివారం మకర సంక్రాంతి, సోమవారం కనుమ పండుగను జరుపుకునేందుకు ప్రతి ఇల్లూ ముస్తాబైంది. అప్పుడే వైష్ణవాలయాల్లో విష్ణు సహస్ర నామపారాయణాలు వినిపిస్తున్నాయి. భోగి రోజు గోదాదేవి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాలన్నీ సర్వంగా సుందరంగా ముస్తాబయ్యాయి. కల్యాణ వేదికకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని భావించి.. ముందస్తు ఏర్పాటు చేశారు.

మార్కెట్లో సందడి..

మూడు రోజుల పాటు ప్రతి ఇంటి లోగిలి ముత్యాల ముగ్గులతో కళకళలాడనుండగా, మార్కెట్లో రంగుల విక్రయాలు ఊపందుకున్నాయి. గ్రామీణులు పట్టణాలకు గొబ్బెమ్మల తయారీకి కావాల్సిన వస్తువులు, చెరుకు గడలు, బంతిపూలు, మామిడి ఆకులు తెచ్చి అమ్ముతున్నారు. వీటి కొనుగోలుకు నగర వాసులు ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా చిత్తూరు నగరంలోని చర్చివీధి, బజారువీధి జనంతో కిటకిటలాడుతున్నాయి. దుకాణాల్లో రద్దీ నెలకొంది.

పుంగనూరుకు వచ్చి బాబు చేసేదేమి లేదు

సదుం: పుంగనూరుకు వచ్చి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సంగతి చూస్తానంటూ మాజీ సీఎం చంద్రబాబు ప్రగల్భాలు పలుకుతున్నారని, ఆయన వచ్చి చేసేది ఏమీ లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. స్థానిక పీఎల్‌ఆర్ భవనంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడా రు. రానున్న ఎన్నికల్లో పుంగనూరులో ఎవరు నిలబడ్డా రామచంద్రారెడ్డికి 70 వేల మెజారిటీ సాధించడం ఖాయమన్నారు. టీడీపీ అభ్యర్థి ఘోరంగా ఓడిపోకపోతే తామంతా రాజకీయ సన్యాసం తీసుకుంటామని సవాలు విసిరారు. చంద్రబాబు సమావేశాల్లో తాను గెలిస్తే ఏమి చేస్తానో చెప్పకుండా, మంత్రిపై ఆరోపణలు చేయడానికే చంద్రబాబుకు సమ యం సరిపోతోందన్నారు. శివశక్తి డెయిరీపై ఆయన అవాస్తవాలను ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. తన డెయిరీ స్థాపించడానికి చిత్తూరు కోఆపరేటివ్ డెయిరీని మూసివేసి, వేలాది రైతులు కడుపుకొట్టిన విషయం జిల్లా ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. తాము స్థానికంగానే పాలు సేకరిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా పాడి రైతులను దోచుకుంటున్న చంద్రబాబు డెయిరీపై టీడీపీ దద్దమ్మలు నోరు మెదపాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నల్లారి, చల్లా ఎమ్మెల్యేలు కాలేరు

నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, చల్లా బాబు జీవితంలో ఎమ్మెల్యేలు కాలేరని పెద్దిరెడ్డి స్పష్టం చేశారు. అన్ని పార్టీల్లో అన్ని కులాలు, మతాలు ఉంటాయని, టీడీపీ నేతలు దాడుల్లో అరెస్టు అయితే కులాల వారీగా రెచ్చగొట్టి మేలు పొందాలని చూస్తు న్నారని ఆరోపించారు. గతంలో పుంగనూరు నియోజకవర్గంపై కక్షతో అభివృద్ధిని అడ్డుకుంటే, ఇప్పుడు రాష్ట్రంలోనే మంత్రి చొరవతో అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉందని చెప్పారు. కిరణ్‌కుమార్‌రెడ్డి ఓ ఫెయ్యూర్ సీఎంగా చరిత్రలో నిలిచారని, తమ్ముడు కిశోర్ ఆయనకు వెన్నుపోటు పొడిచి టీడీపీలో చేరారని తెలిపారు. అన్న సీఎంగా ఉన్నప్పుడు సైతం వందలాది బలగాలతో నియోజకవర్గంలో పర్యటించి భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ప్రశాంతంగా ఉన్న పుంగనూరు నియోజకవర్గాన్ని తమ మేలు కోసం, ప్రాభవం కోసం టీడీపీ నేతలు ఇదేమి ఖర్మతో అలజడులు సృష్టిస్తున్నారన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

రొంపిచెర్ల: శ్రీరాముల వడ్డిపల్లెలో సుధారాణికి వైఎస్సార్ బీమా కింద రూ.10వేలను తక్షణసాయంగా శుక్రవారం సర్పంచ్ సుధా రాణి పంపిణీ చేశారు. సుధారాణి భర్త మల్లికార్జున అనారోగ్యంతో ఇటీవలే మృతి చెందారు. మిగిలిన రూ.90 వేలు నగదును బాధితురాలి బ్యాంక్ అకౌంట్‌లో జమ అవుతుందని సర్పంచ్ తెలిపారు. ఏపీఎం బ్రహ్మానందరెడ్డి, మాజీ సర్పంచ్ రామనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సీవీరమణ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దిగువపోకలవారిపల్లె సచివాలయంలో శుక్రవారం కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పోకల చంద్ర అందజేశారు. పంచాయతీలో కొత్తగా 9మందికి రేషన్ కార్డులు మంజూరు అయ్యాయి. సర్పంచ్ పోకల ఉమాదేవి, నాయకులు శ్రీనివాసులు, గంగయ్య, దామోదర్ రెడ్డి, శ్రీధర్, చెంగల్‌రాయులు, వీఆర్వో శ్రీనివాస్, కార్యదర్శి సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పలమనేరు: పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మార్కెటింగ్‌శాఖ ఏడీ పరమేశ్వరన్, డీఈ హరినాథ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. మార్కెట్ కమిటీలోని వివిధ విభాగాలను, క్యాటిల్‌ఫామ్ వద్ద నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టమాటా మార్కెట్ పనులను పరిశీలించారు. అలాగే వీకోట మండలంలోని శివునికుప్పం వద్ద ఏర్పాటు చేయనున్న మామిడికాయల మార్కెట్ ఏర్పాటు స్థలాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఆంజినేయులు, ఎమ్మార్ వేణు, కార్యదర్శి సంజీవకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



శివునికుప్పం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దుప్పట్ల పంపిణీ

పలమనేరు: మున్సిపల్ పరిధి 16వ వార్డు రాధాబంగ్లా ప్రాంతంలోని పేదలకు కౌన్సిలర్ శ్యామ్ సుందర్‌రాజు ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ హేమంత్‌కుమార్‌రెడ్డి శుక్రవారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని పేదలకు దుప్పట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జావీద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: కోగిలేరు గ్రామ ఎస్టీలకు సర్పంచ్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో కలుపల్లి చిన్నా మిత్ర బృందం శుక్రవారం దుప్పట్లు, మాస్కులు పంపిణీ చే సింది. సర్పంచ్ మాట్లాడుతూ భవిష్యత్‌లోనూ సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. చలికాలం పేదలకు దుప్పట్లు పంపిణీ చేయడంతో వారికి చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

మౌలిక వసతుల కల్పన

వి.కోట: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు సర్పంచ్ పీఎస్.లక్ష్మి, పంచాయతీ ఈఓ యాదవపతి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్కూల్ వీధి, బ్రాహ్మణవీధి, మసీదువీధి, ,ఈశ్వర్‌నగర్, బంగ్లాచేను, దాసార్లపల్లె, గాండ్లపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్ల పనులను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు.

సాక్షి బిజినెస్
శనివారం
14-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
303	98
60,261	17,957

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,978	▽	23
డోజోన్స్	34,193	▲	3
ఎఫ్‌టీఎస్ఈ 100	7,844	▲	50
డాక్స్	15,087	▲	28
షాంఘై	3,195	▲	31
నికాయ్	26,120	▽	330

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	56,462 ▲	352
బంగారం (99.5 స్వచ్ఛత)	56,236 ▲	351
వెండి (కేజీ)	68,115 ▲	90

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		79.50	83.18
£	బ్రిటన్ పౌండ్		96.84	101.69
€	యూరో		85.71	90.23
¥	జపాన్ ఎన్ (100)		50.00	76.00
AU$	ఆస్ట్రేలియా డాలర్		54.20	59.09
S$	సింగపూర్ డాలర్		59.21	63.76
SAR	సౌదీ రియాల్		20.69	22.36
UAE D	యూఏఈ దిర్హామ్		21.25	23.04
¥	చైనా యువాన్		10.98	13.01

డిజిటల్ వినియోగానికి ఎదురుదెబ్బ: గూగుల్

న్యూఢిల్లీ: గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందంటూ కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ) తమకు జరిమానా విధించడంపై టెక్ దిగ్గజం గూగుల్ స్పందించింది. కనెక్టివిటీకి అడ్డంకులను తొలగించే దిశగా సురక్షితమైన స్మార్ట్‌ఫోన్లను అందుబాటులోకి తేవాల్సిన దశలో ఇలాంటి ఆదేశాలు ఇవ్వడం వల్ల దేశీయంగా డిజిటల్ వినియోగం వేగవంతం కాకుండా విఘాతం కలుగుతుందని వ్యాఖ్యానించింది. గూగుల్ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టం విషయంలో గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందంటూ రూ. 1,338 కోట్లు, ప్లే స్టోర్‌కి సంబంధించి అనుచిత విధానాలపై మరో రూ. 936 కోట్ల మొత్తాన్ని సీసీఐ జరిమానా విధించిన సంగతి తెలిసిందే.

క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ నుంచి వరి సంరక్షణా పురుగు మందు

హైదరాబాద్: వరి పంట రక్షణ, రైతులకు లాభదాయకత పెంపు లక్ష్యంగా క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ సంస్థ మార్కెట్లోకి సరికొత్త పురుగుమందును ఆవిష్కరించింది. పంట సమయంలో చీడపీడలను నియంత్రించడమే కాకుండా, వరి పంట మొత్తాన్ని సురక్షితంగా ఉంచడానికి, దిగుబడిని పెంచడానికి, నాణ్యమైన ఉత్పత్తికి 'మెంటార్' పేరుతో విడుదలైన ఈ ప్రొడక్ట్ దోహదపడుతుందని ఈ మేరకు వెలువడిన ఒక ప్రకటన వివరించింది. దేశవ్యాప్తంగా వివిధ అగ్రి విశ్వవిద్యాలయాలలో మెంటర్‌ను పరీక్షించడం జరిగిందని ప్రకటన తెలిపింది. వరి పంట విషయంలో చీడపీడలను అరికట్టడంలో ఇది ప్రభావవంతంగా పనిచేస్తున్నట్లు పేర్కొంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-1-2023	
విశాఖ	572-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	563-00
విజయవాడ	563-00
రిటైల్ ధర (డజను)	84.00
13-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	563-00
వరంగల్	565-00
రిటైల్ ధర	6.20

విప్రో లాభం రూ. 3,053 కోట్లు

- క్యూ3 ఫలితాల విడుదల
- ఆదాయం రూ. 23,229 కోట్లు
- 4.3 బిలియన్ డాలర్ల ఆర్డర్లు
- 2,58,744కు మొత్తం సిబ్బంది

న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 2.8 శాతం బలపడి రూ. 3,053 కోట్లను తాకింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 2,969 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 14 శాతం ఎగసి రూ. 23,229 కోట్లకు చేరింది. మార్చితో ముగియనున్న పూర్తి ఏడాదికి ఐటీ సర్వీసుల ఆదాయం 11.5-12 శాతం మధ్య పుంజుకోనున్నట్లు తాజాగా అంచనా(గైడెన్స్) ప్రకటించింది. వాటాదారులకు షేరుకి రూ. 1 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. ఈ ఏడాది క్యూ2(జూలై-సెప్టెంబర్)తో పోలిస్తే నికర లాభం 15 శాతం, ఆదాయం 3 శాతం వృద్ధి చూపాయి.



ఫలితాలను ప్రకటిస్తున్న విప్రో సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్

డీల్స్ రికార్డ్..

ప్రపంచ అనిశ్చితుల్లోనూ క్యూ3లో రికార్డ్ నెలకొల్పుతూ మొత్తం 4.3 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకున్నట్లు విప్రో సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్ పేర్కొన్నారు. ఇది 26 శాతం వృద్ధికాగా.. వీటిలో బిలియన్ డాలర్ల విలువకు మించిన భారీ ఆర్డర్లను సైతం పొందినట్లు తెలియజేశారు. క్యూ4(జనవరి-మార్చి)లోనూ ఇదే స్థాయి ఆర్డర్లు పొందే వీలున్నట్లు అంచనా వేశారు. క్లయింట్లతో లోతైన సంబంధాల ద్వారా అత్యధిక స్థాయిలో డీల్స్ కుదుర్చుకోగలుగుతున్నట్లు వివరించారు. ట్రాన్స్‌ఫార్మేషన్ లక్ష్యాలు, వ్యయ క్రమబద్ధీకరణ తదితర అంశాలలో క్లయింట్లకు అందిస్తున్న సమర్థవంత సేవలు ఇందుకు దోహదపడుతున్నట్లు తెలియజేశారు. పూర్తిస్థాయి క్లౌడ్ సర్వీసులు, ఇంజనీరింగ్ సర్వీసులు ఆర్డర్‌బుక్‌కు దన్నుగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇతర హైలైట్స్

- క్యూ2తో పోలిస్తే విప్రో ఉద్యోగుల సంఖ్య నికరంగా 435 తగ్గి 2,58,744ను తాకింది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 1.8 శాతం తగ్గి 21.2 శాతానికి చేరింది.
- ఐటీ సర్వీసుల నిర్వహణ మార్జిన్లు 1.2 శాతం బలపడి 16.3 శాతానికి చేరాయి.
- ఐటీ సర్వీసుల ఆదాయం 6.2 శాతం వృద్ధితో 280.35 కోట్ల డాలర్లను తాకింది.
- ఐటీ ప్రొడక్టుల ఆదాయం 2.08 కోట్ల డాలర్లు(రూ. 170 కోట్లు)గా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు యథాతథంగా రూ. 396 వద్ద ముగిసింది.

3 రోజుల నష్టాలకు చెక్

ముంబై: ద్రవ్యోల్బణ ఆందోళనలు ఉపశమించిన నేపథ్యంలో మూడు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. మెటల్, ఫైనాన్షియల్స్, ఐటీలో కొనుగోళ్లు దేశీ స్టాక్ మార్కెట్లు జోష్‌నిచ్చాయి. వెరసి సెన్సెక్స్ ట్రిపుల్ సెంచరీ చేసి 60,000 మార్క్‌ను అధిగమించింది. 303 పాయింట్లు జమ చేసుకుని 60,261 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 98 పాయింట్లు ఎగసి 17,957 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 460 పాయింట్లు జంప్‌చేయగా.. నిఫ్టీ 18,000 స్థాయికి చేరువైంది. అయితే తొలుత మార్కెట్లు నష్టాలతో ప్రారంభమయ్యాయి. తదుపరి ట్రేడర్లు షార్ట్ కవరింగ్ చేపట్టడంతో మిడ్ సెషన్ నుంచీ జోరందుకున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు.

కన్జూమర్ డ్యూరబుల్స్ వీక్

ఎన్ఎస్ఈలో ప్రధానంగా మెటల్, బ్యాంకింగ్, ఐటీ, ఆటో రంగాలు 1.3-0.6 శాతం మధ్య పుంజుకోగా... కన్జూమర్ డ్యూరబుల్స్ 1 శాతం నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్, ఇండస్ఇండ్, ఐషర్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, దివీస్, హీరో మోటో, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్, బీపీసీఎల్, ఐసీఐసీఐ, హెచ్‌యూఎల్, టీసీఎస్, ఎయిర్‌టెల్, మారుతీ, ఎస్‌బీఐ 2-1 శాతం మధ్య బలపడ్డాయి. అయితే టైటన్, ఎస్‌బీఐ లైఫ్, అపోలో హాస్పిటల్స్, నెస్లే, ఎల్‌అండ్‌టీ 1-0.5 శాతం మధ్య క్షీణించాయి.



స్టాక్ హైలైట్స్

- క్యూ3లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 716 కోట్ల అమ్మకాలు సాధించినట్లు వెల్లడించడంతో రియల్టీ కంపెనీ కోల్టేపాటిల్ డెవలపర్స్ 16% దూసుకెళ్లింది. రూ. 303 వద్ద ముగిసింది. తొలుత రూ. 312ను సైతం అధిగమించింది.
- చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టు నుంచి తాజాగా రూ. 1,134 కోట్ల విలువైన ఆర్డర్ పొందడంతో రైల్ వికాస్ నిగమ్(ఆర్‌వీఎన్‌ఎల్) కౌంటర్ 5 శాతం ఎగసి రూ. 80 వద్ద ముగిసింది.
- కొద్ది రోజులుగా ర్యాలీ బాటలో సాగుతున్న ఆర్కియన్ కెమికల్స్ షేరు మరోసారి 8 శాతం జంప్‌చేసి రూ.617 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ.629 వద్ద కొత్త గరిష్టాన్ని తాకింది.

ప్రభుత్వ, ప్రైవేటు రంగం కలిసి పనిచేయాలి

- అవకాశాలను సొంతం చేసుకోవాలి
- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- బడ్జెట్‌కు ముందు ఆర్థికవేత్తలతో చర్చలు

న్యూఢిల్లీ: ప్రభుత్వ, ప్రైవేటు రంగం కలసికట్టుగా పనిచేయాలని, అంతర్జాతీయంగా ఉన్న పరిణామాల నేపథ్యంలో తమ పరిధి దాటి విశాల దృక్పథంతో ఆలోచించి అవకాశాలను సొంతం చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌కు ముందు ప్రముఖ ఆర్థికవేత్తలతో శుక్రవారం ప్రధాని సమావేశమయ్యారు. వారి అభిప్రాయాలు, సూచనలను తెలుసుకున్నారు. డిజిటల్ కార్యకలాపాల విషయంలో, ఫిన్‌టెక్ విస్తరణలో దేశం సాధించిన విజయాన్ని ప్రధాని ఈ సందర్భంగా ప్రశంసించినట్టు అధికారికంగా ఓ ప్రకటన విడుదలైంది. సమ్మిళిత వృద్ధికి ఇది కీలకమని ప్రధాని అభిప్రాయపడ్డారు. భారత్ వృద్ధిలో మహిళల పాత్ర కీలకమని పేర్కొంటూ, ఉత్పాదకతలో మహిళలను మరింతగా భాగస్వాములను చేయాలని కోరారు. రిస్కులు ఉన్నప్పటికీ అంతర్జాతీయంగా డిజిటైజేషన్, ఇంధనం, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం రంగాల్లో విస్తృతమైన అవకాశాలున్నట్టు ప్రధాని పేర్కొన్నారు. ఈ అవకాశాలను సొంతం చేసుకునేందుకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. భారత్ తన వృద్ధిని స్థిరంగా కొనసాగించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఆర్థికవేత్తలు ఈ సమావేశంలో ప్రధానికి సూచించినట్టు ప్రభుత్వ ప్రకటన తెలిపింది. అంతర్జాతీయంగా ప్రస్తుతం నెలకొన్న సమస్యలు కొనసాగుతాయంటూ, భారత్ మరింత బలమైన వృద్ధిని నమోదు చేసేందుకు చర్యలను ప్రతిపాదించినట్టు పేర్కొంది. ఈ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ, ఉన్నతాధికారులతోపాటు.. ఆర్థికవేత్తలు శంకర్ ఆచార్య, అశోక్ గులాటీ, షమిక రవి తదితరులు పాల్గొన్నారు.



ఇతర రంగాలకూ పీఎల్ఐ స్కీమ్

- రానున్న సంవత్సరాల్లో వచ్చే చాన్స్
- బడ్జెట్‌లో డిమాండ్ బలోపేతానికి చర్యలు
- పరిశ్రమ వర్గాల ఆశాభావం

న్యూఢిల్లీ: ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం ఎంతో ప్రయోజనకరమని మెజారిటీ వ్యాపారవేత్తలు భావిస్తున్నారు. రానున్న రోజుల్లో పీఎల్ఐ కింద ఇతర రంగాలకూ ప్రోత్సాహకాలు లభిస్తాయన్న ఆశాభావం వారి నుంచి వ్యక్తమైంది. డిమాండ్ బలోపేతానికి వీలుగా బడ్జెట్‌లో ప్రకటించే చర్యలు అన్ని రంగాల్లో వృద్ధికి ఊతంగా నిలుస్తాయన్న అభిప్రాయం కంపెనీల ప్రతినిధుల్లో వ్యక్తమైంది. మూలధన వ్యయాలపైనా బడ్జెట్ దృష్టి సారిస్తుందని అంచనా వేస్తున్నారు. డెలాయిట్ సర్వే వివిధ రంగాల్లోని పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను తెలుసుకుంది. మూలధన వ్యయాలు, మౌలిక సదుపాయాలకు రుణాలను అందించడం వృద్ధికి కీలకమన్న అభిప్రాయం వ్యక్తమైంది. భారత ప్రభుత్వ బాండ్ల ద్వారా నిధులు సమీకరించాలని సర్వేలో 60 శాతం మంది సూచించారు. రానున్న బడ్జెట్ నుంచి పరిశ్రమ ఏమి ఆశిస్తుందో తెలుసుకునే ప్రయత్నం సర్వేలో భాగంగా డెలాయిట్ చేసింది. 10 రంగాల నుంచి 181 మంది ప్రతినిధులు సర్వేలో పాల్గొని అభిప్రాయాలు తెలియజేశారు.



పారిశ్రామికవేత్తల అభిప్రాయాలు

- 70 శాతానికి పైగా పరిశ్రమల ప్రతినిధులు పీఎల్ఐ పథకం తమ రంగం వృద్ధికి మేలు చేస్తుందని చెప్పారు.
- 60% మంది పీఎల్ఐ ప్రోత్సాహకాలను మరిన్ని రంగాలకు ప్రకటిస్తారని ఆశిస్తున్నారు.
- పన్నుల్లో మార్పులు తెస్తే అది పరిశ్రమల వృద్ధికి ప్రయోజనం కలిగిస్తుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. రానున్న బడ్జెట్‌లో ఎక్కువ మంది బలంగా దీన్ని కోరుకుంటున్నారు.
- ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు పెట్టుబడుల వృద్ధికి దోహదం చేస్తాయని భావిస్తున్నారు.
- ఎంఎస్ఎంఈలను జీఎస్‌టీ కిందకు తీసుకొస్తే పరిశ్రమల వృద్ధి స్థిరత్వానికి సాయపడుతుందని, వాణిజ్య లావాదేవీలు పెరుగుతాయని చెప్పారు.
- 45 శాతం మంది పన్ను బాధ్యతలను ప్రభుత్వం తగ్గిస్తుందని అంచనా వేస్తుంటే, 44 శాతం మంది టీడీఎస్‌కు సంబంధించి స్పష్టత కోరుకుంటున్నారు.
- మూలధన లాభాల పన్ను నిర్మాణాన్ని మరింత సులభతరంగా మార్చాలని పరిశ్రమ కోరుతోంది.
- కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 14 రంగాలకు పీఎల్ఐ కింద రూ. 2 లక్షల కోట్ల ప్రోత్సాహకాలను ప్రకటించింది. తోలు, సైకిల్, టీకాల తయారీ, టెలికం ఉత్పత్తులకు పీఎల్ఐ విస్తరణ ప్రతిపాదన పరిశీలనలో ఉంది.



నేటి నుంచి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీ

దక్షిణాఫ్రికా వేదికగా నేటి నుంచి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ జరగనుంది. 16 జట్లు తలపడుతున్న ఈ టోర్నీ ఈనెల 29న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. గ్రూప్ 'ఎ'లో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంక, అమెరికా; గ్రూప్ 'బి'లో ఇంగ్లండ్, పాకిస్తాన్, జింబాబ్వే, రువాండా; గ్రూప్ 'సి'లో ఇండోనేసియా, ఐర్లాండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్; గ్రూప్ 'డి'లో భారత్, దక్షిణాఫ్రికా, స్కాట్లాండ్, యూఏఈ జట్లున్నాయి. నేడు జరిగే తమ తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ ఆడుతుంది. భారత జట్టులో హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిష, వైజాగ్‌కు చెందిన షబ్నమ్ సభ్యులుగా ఉన్నారు.

టెన్నిస్‌కు సానియా గుడ్‌బై

వచ్చే నెలలో రిటైర్ కానున్న భారత స్టార్

మెల్‌బోర్న్: భారత వెటరన్ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా ఫిబ్రవరిలో జరిగే దుబాయ్ ఓపెన్ తర్వాత రిటైర్ అవుతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆమె ట్విట్టర్‌లో భావోద్వేగపు లేఖను 'లైఫ్ అప్‌డేట్' అనే క్యాప్షన్‌తో పంచుకుంది. మూడు పేజీల ఈ లేఖలో తన 30 ఏళ్ల రాకెట్ పయనాన్ని, చివరి గమ్యాన్ని వివరించింది. 'నా గ్రాండ్‌స్లామ్ ప్రయాణం 2005లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌తోనే మొదలైంది. ఇప్పుడు గ్రాండ్‌స్లామ్ ఆట కూడా అక్కడే ముగించేందుకు సరైన వేదిక అనుకుంటున్నా. 18 ఏళ్ల క్రితం ఎక్కడైతే ఆరంభించానో అక్కడే ఆపేయబోతున్నా. ఇక కెరీర్‌లో చివరి టోర్నీ మాత్రం దుబాయ్ ఓపెన్. ఫిబ్రవరిలో ఈ టోర్నీతో సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతాను. ఇన్నేళ్ల పయనంలో ఎన్నో ఆటుపోట్లే కాదు మరెన్నో మధురస్మృతులూ ఉన్నాయి' అని అందులో పేర్కొంది. నాసర్ స్కూల్‌కు చెందిన ఆరేళ్ల బాలిక ఎలా టెన్నిస్ నేర్చుకుంది... తన కలలకు ఎక్కడ బీజం పడింది... అన్నింటికీ మించి దేశానికి ప్రాతినిధ్యం ఎలాంటి స్ఫూర్తినిచ్చిందో ఆ లేఖలో చెప్పుకొచ్చింది. అర్ధ సెంచరీని దాటిన తన గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో గెలిచిన కొన్ని టైటిళ్లు దేవుడిచ్చిన వరమంది. 'నా సుదీర్ఘ కెరీర్‌లో దేశానికి పతకాలు తేవడమే అతిపెద్ద గౌరవంగా భావిస్తాను. పతకం నా మెడలో పడినపుడు జాతీయ పతాకం రెపరెపలాడినపుడు కలిగే ఆనందం అన్నింటికి మించి ఉంటుంది. ఇప్పుడు దీన్ని తలచుకొని రిటైర్మెంట్ సందేశం రాస్తున్నప్పుడు చెరిగిపోని ఆ అనుభూతి నా కళ్లను చెమరుస్తోంది' అని 36 ఏళ్ల సానియా పేర్కొంది.



భారత్ శుభారంభం

నాలుగోసారి ప్రపంచకప్ పురుషుల హాకీ టోర్నీకి ఆతిథ్యమిస్తున్న భారత జట్టు ఆనవాయితీని కొనసాగించింది. స్వదేశంలో జరిగిన గత మూడు ప్రపంచకప్‌లలో భారత జట్టు తాము ఆడిన తొలి మ్యాచ్‌లో విజేతగా నిలిచింది. నాలుగోసారీ ఈ ఫలితంలో మార్పు లేకుండా చూసుకున్న టీమిండియా ఈ మెగా ఈవెంట్‌లో శుభారంభం చేసింది. 48 ఏళ్లుగా ఊరిస్తున్న ప్రపంచకప్ టైటిల్ వేటను విజయంతో మొదలుపెట్టింది.

- తొలి మ్యాచ్‌లో స్పెయిన్‌పై 2-0తో విజయం
- ప్రపంచకప్ హాకీ టోర్నీ

రూర్కెలా (ఒడిశా): సొంతగడ్డపై తమ సత్తా చాటుకుంటూ భారత పురుషుల హాకీ జట్టు ప్రపంచకప్ టోర్నీలో బోణీ కొట్టింది. స్పెయిన్ జట్టుతో శుక్రవారం జరిగిన పూల్ 'డి' తొలి లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత జట్టు 2-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. ఆట 12వ నిమిషంలో వైస్ కెప్టెన్ అమిత్ రోహిదాస్... 26వ నిమిషంలో హార్దిక్ సింగ్ ఒక్కో గోల్ సాధించి భారత విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆద్యంతం భారత్ ఆధిపత్యం చలాయించిన ఈ మ్యాచ్‌లో టీమిండియాకు ఐదు పెనాల్టీ కార్నర్‌లు రాగా... స్పెయిన్ మూడు పెనాల్టీ కార్నర్‌లు సంపాదించింది. భారత్ ఐదు పెనాల్టీ కార్నర్‌లలో ఒక దానిని సద్వినియోగం చేసుకోగా... స్పెయిన్ మూడింటినీ వృథా చేసుకుంది. ఆదివారం జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో భారత్ ఆడుతుంది.

స్పెయిన్‌తో మ్యాచ్‌లో భారత్ సంపూర్ణ ఆధిపత్యాన్ని కనబరిచింది. అవకాశం దొరికినపుడల్లా భారత ఆటగాళ్లు నీలకంఠ శర్మ, మన్‌దీప్ సింగ్, ఆకాశ్‌దీప్ సింగ్, అభిషేక్ గోల్‌పోస్ట్‌పై దాడులు చేసినా స్పెయిన్ అప్రమత్తంగా ఉంటూ వాటిని నిలువరించింది. లేదంటే భారత్ ఖాతాలో మరిన్ని గోల్స్ చేరేవి. 12వ నిమిషంలో లభించిన రెండో పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ డ్రాగ్ ఫ్లిక్ చేయగా... బంతి స్పెయిన్ డిఫెండర్‌కు తగిలి వెనక్కి వచ్చింది. అక్కడే ఉన్న అమిత్ రోహిదాస్ బంతిని లక్ష్యానికి చేర్చడంతో భారత్ ఖాతా తెరిచింది. అనంతరం 26వ నిమిషంలో ఎడమ వైపు నుంచి హార్దిక్ సింగ్ దూసుకొస్తూ అదే జోరులో క్రాస్ షాట్‌తో బంతిని స్పెయిన్ గోల్‌పోస్ట్‌లోనికి పంపించాడు. దాంతో భారత ఆధిక్యం 2-0కు పెరిగింది. మూడో క్వార్టర్‌లో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌ను వృథా చేయడం గమనార్హం. తొలి రోజు జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో పూల్ 'ఎ'లో అర్జెంటీనా 1-0తో దక్షిణాఫ్రికాపై... మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా 8-0తో ఫ్రాన్స్‌పై గెలుపొందగా... పూల్ 'డి'లోని మరో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 5-0తో వేల్స్ జట్టును ఓడించింది.



అమిత్ రోహిదాస్

8 ప్రపంచకప్ టోర్నీలలో తాము ఆడిన తొలి మ్యాచ్ లో భారత్ గెలుపొందడం ఇది ఎనిమిదో సారి. 15వసారి ప్రపంచకప్ జరుగుతుండగా... భారత్ రెండుసార్లు తమ తొలి మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, ఐదుసార్లు తమ తొలి మ్యాచ్‌లో ఓడిపోయింది.

సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ ద్వయం 17-21, 22-20, 21-9తో లియు యు చెన్-జువాన్ యి ఒయు (చైనా) జోడీపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ ప్రణయ్ 16-21, 21-19, 12-21తో ప్రపంచ ఏడో ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో ఓడిపోయాడు. ప్రణయ్‌కు 6,875 డాలర్ల (రూ. 5 లక్షల 60 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 6,600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఆంధ్ర జట్టుకు నిరాశ

ఢిల్లీకి తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

న్యూఢిల్లీ: చివరి వికెట్ తీయడంలో విఫలమైన ఆంధ్ర జట్టు బౌలర్లు ఢిల్లీ జట్టుతో జరిగిన రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కోల్పోయారు. మ్యాచ్ 'డ్రా'గా ముగిసినా 29 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించినందుకు ఢిల్లీ జట్టుకు మూడు పాయింట్లు లభించగా... ఆంధ్ర ఖాతాలో ఒక పాయింట్ మాత్రమే చేరింది. ఓవర్‌నైట్ స్కోరు 300/4తో ఆట చివరిరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఢిల్లీ జట్టు 9 వికెట్లకు 488 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్లలో ధ్రువ్ షోరే మరో 43 పరుగులు జోడించి వ్యక్తిగత స్కోరు 185 వద్ద అవుటవ్వగా... హిమ్మత్ సింగ్ (104; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. హిమ్మత్ సింగ్ అవుటైనపుడు ఢిల్లీ స్కోరు 423/9. చివరి వికెట్ తీసిఉంటే ఆంధ్ర జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతోపాటు మూడు పాయింట్లు లభించేవి. కానీ ఢిల్లీ బ్యాటర్లు హర్షిత్ రాణా (46 బంతుల్లో 33 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), దివిజ్ మెహ్రా (38 బంతుల్లో 32 నాటౌట్; 6 ఫోర్లు) మొండి పట్టుదలతో ఆడి చివరి వికెట్‌కు అజేయంగా 65 పరుగులు జోడించారు. ఐదు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఆంధ్ర గ్రూప్ 'బి' 13 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది.



హిమ్మత్

భారత టెస్టు జట్టులోకి సూర్యకుమార్

- ఇషాన్ కిషన్‌కు తొలిసారి పిలుపు
- ఆసీస్‌తో తొలి రెండు టెస్టులకు జట్టు ప్రకటన

ముంబై: ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై జరిగే 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లోని తొలి రెండు టెస్టుల కోసం 17 మంది సభ్యులతో భారత జట్టును సెలక్టర్లు ప్రకటించారు. టి20లో తన విధ్వంసక ఆటతో చెలరేగుతున్న సూర్యకుమార్ యాదవ్ తొలిసారి టెస్టు టీమ్‌లోకి ఎంపికయ్యాడు. ఇప్పటి వరకు టెస్టుల్లో అవకాశం రాకపోయినా ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లోనూ సూర్యకు మంచి రికార్డే ఉంది. 79 మ్యాచ్‌లలో అతను 44.75 సగటుతో 5549 పరుగులు చేయగా, ఇందులో 14 సెంచరీలు ఉన్నాయి. మరో వైపు కారు ప్రమాదానికి గురైన వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఇప్పట్లో కోలుకునే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయ వికెట్ కీపర్‌గా ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేశారు. ఆంధ్ర ఆటగాడు కోన శ్రీకర్ (కేఎస్) భరత్ ఇప్పటికే టెస్టు టీమ్‌తో ఉండగా (ఇంకా మ్యాచ్ ఆడలేదు), కిషన్‌కు టెస్టుల్లో ఇదే తొలి అవకాశం. బుమ్రాను ఎంపిక చేయకపోవడంతో అతను పూర్తిగా కోలుకోలేదని తేలింది. గాయం నుంచి కోలుకుంటున్న రవీంద్ర జడేజానూ జట్టులోకి తీసుకున్నా... ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే ఆడతాడు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఫిబ్రవరి 9నుంచి నాగపూర్‌లో తొలి టెస్టు జరుగుతుంది.

టెస్టు జట్టు వివరాలు: రోహిత్ శర్మ (కెప్టెన్), రాహుల్, గిల్, పుజారా, కోహ్లి, శ్రేయస్, కేఎస్ భరత్, ఇషాన్ కిషన్, అశ్విన్, అక్షర్, కుల్దీప్, జడేజా, షమీ, సిరాజ్, ఉమేశ్, ఉనాద్కట్, సూర్యకుమార్.



సూర్య, ఇషాన్

న్యూజిలాండ్‌దే సిరీస్


కరాచీ: పాకిస్తాన్ గడ్డపై మూడు మ్యాచ్‌ల ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను న్యూజిలాండ్ జట్టు తొలిసారి సొంతం చేసుకుంది. పాకిస్తాన్‌తో శుక్రవారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో న్యూజిలాండ్ రెండు వికెట్ల తేడాతో గెలిచింది. తద్వారా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను న్యూజిలాండ్ 2-1తో దక్కించుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 280 పరుగులు చేసింది. ఫఖర్ జమాన్ (101; 10 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించాడు. మొహమ్మద్ రిజ్వాన్ (77; 6 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. కివీస్ బౌలర్లలో టిమ్ సౌతీ (3/56) ఆకట్టుకున్నాడు. అనంతరం న్యూజిలాండ్ 48.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 281 పరుగులు చేసి విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' డెవాన్ కాన్వే (52; 5 ఫోర్లు, 1 సిక్స్), విలియమ్సన్ (53; 2 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ ఫిలిప్స్ (42 బంతుల్లో 63 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించి న్యూజిలాండ్ విజయంలో కీలకపాత్ర పోషించారు. పాక్‌తో సిరీస్ ముగించుకున్న న్యూజిలాండ్ ఈనెల 18 నుంచి భారత్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది.

టి20లకు పృథ్వీ షా, వన్డేల్లో భరత్

న్యూజిలాండ్‌తో సిరీస్‌లకు భారత జట్లు

ముంబై: ఏడాదిన్నర క్రితం అంతర్జాతీయ టి20ల్లో తాను ఆడిన ఏకైక టి20లో తొలి బంతికే అవుటైన పృథ్వీ షా భారత జట్టులోకి పునరాగమనం చేశాడు. న్యూజిలాండ్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్ కోసం సెలక్టర్లు అతడికి అవకాశం కల్పించారు. ఇది మినహా చెప్పుకోదగ్గ మార్పులేమీ లేకుండా ఇటీవల శ్రీలంకతో టి20 సిరీస్ గెలిచిన జట్టునే ఎంపిక చేశారు. కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా కొనసాగనున్నాడు. ఈ సిరీస్‌లో కూడా రోహిత్, కోహ్లిలను ఎంపిక చేయకపోవడంతో అది 'విశ్రాంతి'నా లేక టి20 భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా వారిని పక్కన పెట్టేశారా అనేదానిపై స్పష్టత లేదు. జనవరి 27, 29, ఫిబ్రవరి 1 తేదీల్లో టి20 మ్యాచ్‌లు జరుగుతాయి. వన్డే జట్టులో ఆంధ్ర వికెట్ కీపర్ కేఎస్ భరత్‌కు తొలిసారి అవకాశం లభించింది. శార్దుల్ ఠాకూర్ పునరాగమనం చేయగా, లెఫ్టార్మ్ స్పిన్నర్ షహబాజ్ అహ్మద్‌కు కూడా చోటు కల్పించారు. వన్డేల్లో మాత్రం రోహిత్, కోహ్లి అందుబాటులో ఉంటారు. వ్యక్తిగత కారణాలతో కేఎల్ రాహుల్, అక్షర్‌లను రెండు జట్లలోనూ ఎంపిక చేయలేదని సెలక్టర్లు వెల్లడించారు. ఈ నెల 18, 21, 24 తేదీల్లో వన్డేలు జరుగుతాయి.

వన్డే జట్టు: రోహిత్ (కెప్టెన్), గిల్, ఇషాన్ కిషన్, కోహ్లి, శ్రేయస్, సూర్యకుమార్, భరత్, హార్దిక్, సుందర్, షహబాజ్, శార్దుల్, చహల్, కుల్దీప్, షమీ, సిరాజ్, ఉమ్రాన్. **టి20 జట్టు:** హార్దిక్ (కెప్టెన్), సూర్యకుమార్, ఇషాన్ కిషన్, రుతురాజ్, గిల్, దీపక్ హుడా, రాహుల్ త్రిపాఠి, జితేశ్ శర్మ, సుందర్, కుల్దీప్, చహల్, అర్ష్‌దీప్, ఉమ్రాన్, మావి, పృథ్వీ షా, ముకేశ్ కుమార్.



భరత్